క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ

బనగానపల్లె రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం యాగంటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో–బేటీపడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బాలికలపై వివక్ష చూపరాదన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. చిన్న వయసులో వివాహాలు చేయడం ద్వారా వారి జీవితం అంధకారం అవుతుందన్నారు. బాగా చదివిస్తే కుటుంబానికి ఆసరాగా నిలుస్తారన్నారు. బాలికలు ఋతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శైలు, రామలక్ష్మీ వివరించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రసూల్‌బాషా పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఎంఈఓ, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సభ్యులు

బేతంచెర్ల: సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా శనివారం బేతంచెర్లలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సోమశేఖర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగరాజు, యాగంటయ్య, మద్దిలేటి రెడ్డిలను ఘనంగా సన్మానించారు. పాఠశాల కమిటీ సభ్యులు మధు మోహన్‌రెడ్డి, సముద్రాల మద్దిలేటిస్వామి, మాణిక్యం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఏఈ గర్జప్ప

బనగానపల్లె: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె రూరల్ ఏఈ గర్జప్ప అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సర్వీస్ కోసం వినియోగించే వైర్ నాణ్యమైన, లోడ్‌కు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టేవైర్లు ముట్టుకోరాదని సూచించారు. తడి చేతులతో స్విచ్‌లను తాకరాదన్నారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం విద్యుత్‌శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలని తెలిపారు.

రేషన్ దుకాణంలో సరుకులు సీజ్



స్టాక్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

అవుకు: మండల పరిధిలోని రామాపురంలో ఉన్న రేషన్ దుకాణాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాముడు శనివారం తనిఖీ చేశారు. వడ్డె వెంకట పుల్లయ్యకు చెందిన 37 నంబర్ గల రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వలు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశారు. ఇందులో 1,203 కేజీల పీడీఎస్ బియ్యం, 226 కేజీల చక్కెర, 24 కేజీల జొన్నలు, 3కేజీల కందిబ్యాల్లు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్టాక్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేశామని ఆర్ఐ తెలిపారు. ఆయన వెంట వీఆర్‌ఓ ఓబులేసు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఆకుమల్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈశ్వర్ నాయక్

సంజామల: బ్యాంక్ ఖాతాదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఆకుమల్ల, కమలపూరి గ్రామాల్లో బ్యాంక్ సేవలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్, డిజిటల్ బ్యాంకింగ్‌తో లావాదేవీలు సులభతరంగా ఉంటుందని తెలిపారు. అదే క్రమంలో లాటరీలు, బహుమతుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, మేసేజ్‌లు, లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధినీటిని సరఫరా చేయడమే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ జయరాం



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

డోన్: పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 32వ వార్డుతో పాటు పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాటర్‌ప్లాంట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో కలుషితమైన, బురదమయమైన నీటిని శుద్ధి చేసేటప్పుడు తగినంత మోతాదులో ఆలం వేసి శుద్ధి చేయాలని సూచించారు. అనంతరం 32వ వార్డులో ఎన్‌పీ3 పైపులు వేసిన కల్వర్టులు పూర్తిగా పూడిపోయినందు వల్ల వాటి స్థానంలో పెద్ద పైపులను ఏర్పాటు చేసి మురుగునీరు సజావుగా డ్రైనేజీలో పారేలా ఏర్పాట్లు చేయాలని డీఈ రసూల్‌ను ఆదేశించారు. వర్షపు నీటికి కొట్టుకొచ్చిన మట్టితో పాటు పూడిపోయిన డ్రైనేజీలను జేసీబీ సహాయంతో పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన

ఆగస్టు 15వ తేదీ డోన్ కేవీఎస్ కాలనీలో ఏర్పాటు చేయనున్న అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను శనివారం డీఈ రసూల్, ఏఈ సతీష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాతో కలిసి కమిషనర్ జయరాం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

ప్యాపిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో మురుగు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని సూచించారు. తదుపరి శుభ్రం చేసే తేదీని ట్యాంకులపై రాయించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లను సందర్శించాలని ఆదేశించారు. ప్లాంటుల నుంచి శ్యాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేపట్టాలన్నారు. ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పంచాయతీ కార్యదర్శులు ఫ్రాన్సిస్, నాగయ్య, భూషణ్, నరేశ్, చంద్రశేఖర్, కిరణ్, ముంతాజ్ బేగం, అనిత, మంజుల, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

ప్యాపిలి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో శనివారం వైద్య సిబ్బందితో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ నీటి వనరులు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీళ్ల విరేచనాలు అయితే వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణం తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం రంగమ్మ, శ్రీనివాసరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోకుల్‌లక్ష్మి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఈ నెల 24తేదీలోగా ఈ–మెయిల్‌కు పంపాలన్నారు. సాఫ్ట్ కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

26న అవుకు మండల్ మీట్

అవుకు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ మండల్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులుహాజరు కావాలన్నారు.

గీతామందిరంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా యర్రగుడిలోని సాయిగీతా మందిరంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కాగడ హారతి, సాయి అభిషేకం, పల్లకీ గ్రామోత్సవం చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వందన డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

చర్చలు విఫలం

డోన్ టౌన్: కర్నూలులో డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు సమక్షంలో లారీ డ్రైవర్లు, క్లీనర్ల జీత భత్యాలపై శనివారం జరిగిన చర్చలు విఫలమైంది. లారీ యజమానులు, లారీ డ్రైవర్ల యూనియన్ నాయకుల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నట్లు డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరామ్ తెలిపారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, భోగేశ్వరరెడ్డి, వెంకటరాముడు, తిమ్మయ్య, ఎర్రన్న, రాము పాల్గొన్నారు.

ముందుగా గుర్తించి మందులు వాడితే నయం



కుష్టు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

డోన్ రూరల్: కుష్టు వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి సకాలంలో మందులు వాడితే నయం చేసుకోవచ్చని కొత్తబురుజు పీహెచ్‌సీ వైద్యుడు రాంభూపాల్ అన్నారు. శనివారం కొత్తబురుజు గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో ఓ మహిళకు లెప్రసీ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆమెకు తగిన మందులు అందజేశామని తెలిపారు. స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలు రాలిపోవడం, చేతిలో వస్తువులు జారిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నోడల్ పర్సన్ కె.చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రణీత్‌కుమార్, దుర్గమ్మ, ఉమాదేవి పాల్గొన్నారు.

శ్వేత పత్రాల పేరుతో కాలయాపన తగదు



నంద్యాలకు బయలుదేరి వెళ్తున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి నెల దాటినా హామీల అమలుపై దృష్టి పెట్టకుండా గత ప్రభుత్వ తీరుపై శ్వేత పత్రాల విడుదల పేరుతో కాలయాపన చేయడం తగదని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు అన్నారు. నంద్యాలలో ఆ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి శనివారం వెళ్లారు. ప్రత్యేక హోదా, విభజన హామీలతో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల పనుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తబస్టాండ్, డేవిడ్‌నగర్, కేయి మాదన్ననగర్, కొత్తపేట, కృష్ణానగర్, పాతపేట, ఇందిరానగర్, తారకరామనగర్, కంబాలపాడు రోడ్డు, నెహ్రూనగర్, పట్టణ పోలీస్ స్టేషన్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్ పరిధిలోని ధర్మారం, కన్నపకుంట, చింతలపేట, గోసానిపల్లె గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా గార్లదిన్నె, రామకృష్ణాపురం, మాధవరం గ్రామాల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



కేజీబీవీ పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అవుకు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి అన్నారు. శనివారం అవుకు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల భోజనానికి వినియోగించే కూరగాయలు, సరుకులను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. భోజనానికి వాడే పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ–2 వెంకటేశ్వరరెడ్డి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

మద్దిలేటిస్వామి ఆదాయం రూ.2లక్షలు

బేతంచెర్ల: మండలంలోని లక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి కానుకల ద్వారా శనివారం రూ.2,02,225 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆషాడ మాసం సందర్భంగా భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

డోన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

లారీని ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు



లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు



గాయపడిన మహిళ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ఉడుములపాడు గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న చక్రవర్తి, ఆయన భార్య షమిష్ఠ, కూతురు ఓయిశ్రీకి గాయపడినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వీరు శనివారం కారులో బెంగళూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వీరిని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కర్నూలుకు వెళ్లమని వైద్యులు సూచించగా హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిసింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బనగానపల్లె రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అన్నారు. శనివారం సాయంత్రం యాగంటిపల్లె రహదారిలో వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు లైసెన్స్‌తో పాటు రికార్డులు కలిగి ఉండాలని, ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెంట్ పెట్టుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదం జరిగితే హెల్మెట్ రక్షణగా ఉంటుందని తెలిపారు.





పెట్నికోట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు, గొర్విమానుపల్లెలో..

మృత్యు మలుపులు

కొలిమిగుండ్ల: మండలంలోని పలు రహదారుల మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోజు రవాణ చేసే వాహన చోదకులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పెట్నికోట నుంచి గొర్విమానుపల్లె, తుమ్మలపెంట వరకు నాలుగు చోట్ల రోడ్డు ఎత్తు పల్లాలు, ఒంపులు తిరిగిన మలుపులు ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గం మీదుగా చాలా మంది అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తుంటారు. నాపరాళ్ల ట్రాక్టర్లు ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎత్తు పల్లాల వద్ద ట్రాక్టర్ ఇంజిన్‌లు గాల్లో వేలాడుతుంటాయి. అవుకు మండలంలోని ఉప్పలపాడు, కొండమనాయినపల్లె, జూనుంతుల తదితర గ్రామాలకు కనెక్టివిటీ రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉప్పలపాడు నుంచి పెట్నికోట, గొర్విమానుపల్లె మీదుగా తాడిపత్రికి ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. మలుపుల వద్ద ఇరువైపులా ఉన్న కొండలు పూర్తిగా ప్రమాదకరంగా మారాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని మలుపుల వద్ద కొండలను తొలిచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ముగిసిన జియారత్ వేడుకలు



పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి జియారత్ వేడుకలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి పీర్ల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను చావిళ్లలో కొలువుంచడంతో జియారత్ వేడుకలు ముగిశాయి. వేడుకలను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చౌడేశ్వరిదేవికి పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ, సహస్త్ర దీపాలంకరణ సేవ, ఊయల సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాడు 40.. నేడు 20

- ప్రభుత్వ బడిలో సగానికి పడిపోయిన విద్యార్థుల సంఖ్య



రాగి జావ తాగుతున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంలో విద్యాశాఖ విఫలం కావడంతో పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాట పడుతున్నారు. అంకిరెడ్డిపల్లె ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 40 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 20కి చేరుకుంది. ఒక్కరే ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పాఠాలు భోదిస్తున్నారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు టైం స్కేల్ కింద కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. ఎస్సీ ప్రాథమిక పాఠశాల కోరుకున్న ఉపాధ్యాయుడు జాయినింగ్ ఆర్డర్ తీసుకుని మొదటి రోజు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. ఏడాదిన్నర అయినా ఇప్పటి వరకు ఆ ఉపాధ్యాయుడు పాఠశాల ముఖం చూడలేదు. ప్రస్తుతం అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతుంది. ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించే వరకు అక్కడ పోస్టు భర్తీ అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే సింగిల్ టీచర్ కావడంతో విద్యార్థులు ఎన్‌రోల్ సంఖ్య తగ్గిపోయింది. ఉపాధ్యాయుడిని నియమించాలని ఇటీవలే తల్లితండ్రులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వీడని వాన



కోవెలకుంట్ల సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మూడు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సబ్ డివిజన్‌లోని దొర్నిపాడు మండలంలో 66.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 40 మి.మీ, సంజామల మండలంలో 29.4 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 23.6 మి.మీ, అవుకు మండలంలో 21.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షాలతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలతో పాటు సాగు చేయాల్సిన పంటలకు వర్షం అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంలో ట్రాన్స్‌ఫార్మర్లను తాకొద్దు

సంజామల: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ దుర్గ శ్రీనివాస్ సూచించారు. శనివారం సంజామలలో ఏఈ మాట్లడుతూ.. వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, వైర్లు ముట్టుకోకూడదని అన్నారు. వ్యవసాయ రైతులు పొలాల్లో కరెంట్ వైర్లు తెగిపడినప్పుడు జాగ్రత్తలు పాటించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు వేయవద్దని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు యూనిఫాం క్లాత్ పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ప్యాపిలి: మండలంలోని 6,760 మంది విద్యార్థులకు రావాల్సిన యూనిఫాం క్లాత్ ఎమ్మార్సీకి చేరింది. ఈ క్లాత్‌ను శనివారం అన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తెలిపారు.

17 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన ఉసేని బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. అతని వద్ద నుంచి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.